క్లుప్తంగా

నగరంలో శాకాహారుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న శాకాహారులు

కడప కల్చరల్: కడప నగర పిరమిడ్ స్పిరుచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం శాకాహారులు ర్యాలీ చేపట్టారు. స్థానిక భాగ్యనగర్‌లోని మృత్యుంజయకుంట ఆలయం నుంచి ఈ ర్యాలీని పిరమిడ్ మాస్టర్ జీవీఎస్.రెడ్డి, జీఆర్ఎస్.రెడ్డిలు ప్రారంభించారు. శాకాహారం–అమృతాహారం అంటూ నినాదాలు చేస్తూ సమీప వీధుల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటా కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, వెంకట సుబ్బయ్య, శర్వాణి, బ్రహ్మజ, సంజీవి పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి



సమావేశంలో గిరిజన సంఘం నాయకులు

కడప రూరల్: ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు పీవీ.రమణ అన్నారు. నేతలు కోరారు. స్థానిక గిరిజన భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి డాక్టర్ రామక్రిష్ణ, జిల్లా గౌరవాధ్యక్షుడు సుంకన్న, బాబూ నాయక్, డాక్టర్ వెంకట్ పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర



గంగమ్మతల్లి

కడప అర్బన్: కడప నగరంలోని నబీకోటలో వెలసిన గంగమ్మ తల్లి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముగింపు రోజున బోనాలు సమర్పించారు. ఈ నెల 13వ తేదీ నుంచి ప్రారంభమైన గంగమ్మ జాతరను కడప నగర ప్రజలు అన్ని చోట్ల నుంచి వచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారం బోనాల తరువాత నిర్వహించిన చెక్క భజన అందరినీ అలరించింది.

చిన్నారుల సందడి



చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్: ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా కడప శిల్పారామంలోని సాంస్కృతిక వేదికపై కళాకారులు, చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. శిల్పారామం అధికారులు పర్యవేక్షించారు.

గంగమ్మతల్లికి పూజలు



విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి దర్శనానికి జాతర తర్వాత రెండవ ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు, గంధం, పసుపు, ప్రత్యేకంగా భక్తులు తెప్పించిన అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని అభిషేకాలు, పూజలు చేసి తమ మొక్కుబడులను, ముడుపులను అమ్మవారికి చెల్లించుకున్నారు. భక్తులు అమ్మవారికి మొక్కుబడులను తీర్చుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆలయ సమీపంలోని వివిధ ఆలయాలలో భక్తులు పూజలు చేశారు.

ఆశాలను ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి

ఎర్రగుంట్ల : ప్రభుత్వాలు ఆశా కార్యకర్తలకు ప్రకటించిన వేతనాల పెంపు, ఉద్యోగుల గుర్తింపు జీఓలను తక్షణం జారీ చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణీ కోరారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్ర వైద్య శాఖ మంత్రి నడ్డా వేతనాల పెంపు, ఉద్యోగులుగా గుర్తింపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ త్వరలో ఇస్తామని రాజ్యసభలో ప్రకటించారన్నారు. వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వితంతువులకు పెంఛన్‌లు, రేషన్ కార్డులు, ఇంటి స్థలాలను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, సీపీఐ నాయకులు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతోనే ఆరోగ్యం

జిల్లాలో ఎండల తీవ్రత పెరిగింది. మార్చిలోనే ఎండలు ముదురుతున్నాయి. రాబోయే రోజుల్లో తీవ్రమైన ఎండలతోపాటు వడగాల్పులు వీచే అవకాశం ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ కాలంలో మనం తీసుకునే ఆహారం అత్యంత కీలకమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒక వైపు అధిక ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు శరీరం డీ హైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉంది. చెమట అధికంగా ఉత్పన్నమవుతుంది. ఇలా ఉంటే శరీరంలోని లవణాలు తగ్గిపోయి వడదెబ్బ బారిన పడే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని సూచనలు తప్పక పాటించాలని చెబుతున్నారు.

వేసవిలో.. ఎండలు మరింత తీవ్రం
ఆహార నియమాల్లో మార్పులు తప్పనిసరి



వివిధరకాల పండ్లు

కడప కోటిరెడ్డిసర్కిల్: వైఎస్సార్ కడప జిల్లాలో 40 డిగ్రీల సెంటీగ్రేడ్‌ల లోపు నిత్యం ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రెండు రోజుల్లో 42 వరకూ నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో వేసవి తాపాన్ని తట్టుకోలేక చాలామంది చల్లని ద్రవ పదార్థాలు తీసుకునేందుకు ఇష్టపడతారు. వేసవిలో చర్మవ్యాధులకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇవన్నీ ఎదుర్కోవాలంటే రోగ నిరోధకశక్తి పెంచే విధంగా....ప్రతి ఒక్కరూ సమతుల ఆహారం తీసుకోవాలి. మనం తినే ఆహారం మన ఆరోగ్యాన్ని కాపాడుతుందనే ఆలోచన కలిగి ఉండాలి.

ఎక్కువ నీరు తీసుకోవాలి

శరీరంలో 70 శాతం నీరు ఉంటుంది. అధిక ఉష్ణోగ్రతలు తగ్గించడంలో నీరు ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ఈ విధంగా ప్రతిరోజు 3-5 లీటర్ల వరకు నీరు తీసుకుంటూ ఉండాలి. శరీరం డీ హైడ్రేషన్‌కు గురి కాకుండా చూసుకోవాలి. నిర్లక్ష్యం వహిస్తే వడ దెబ్బకు గురయ్యే అవకాశం ఉంది.

తాజా పండ్లు తీసుకోవాలి

ప్రతి రోజూ నీరు, పోషకాల శాతం ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. తాజా పుచ్చకాయ, కర్బూజ, బొప్పాయి, జామ, అరటి, యాపిల్ పండ్లు తీసుకోవాలి. నిమ్మ, నారింజ, బత్తాయి, కమల రసాలు శ్రేయస్కరం. రాగులు, జొన్నలు తదితర చిరుధాన్యాలు తీసుకోవడం కూడా మంచిది. ఇవి శక్తిని ఇవ్వడంతోపాటు ఎండల్లో నిస్సత్తువ రాకుండా చూస్తుంది.


ద్రవ పదార్థాలు తీసుకోవాలి

ఎండలో ఎక్కువగా తిరిగే వారు ద్రవ పదర్థాలను తీసుకుంటూ రావాలి. మజ్జిగతో పాటు కొబ్బరి నీరు, లస్సీ, చెరుకు రసం అధికంగా వినియోగించాలి. ఉల్లిపాయల్లో శరీరాన్ని చల్లబరిచే గుణం కలిగి ఉంది. ఉల్లిని నిత్యం ఆహారంలో తీసుకుంటే వడ దెబ్బ బారిన పడే అవకాశాలు తక్కువ. మజ్జిగ శరీరంలోని జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంతోపాటు అందులో ప్రో బయోటిక్స్ అధికంగా ఉంటాయి. కొబ్బరినీరు ఈ కాలంలో తరుచుగా తీసుకుంటే ఖనిజ లవణాలు ఎక్కువ శక్తిని ఇచ్చి వడగాలులు, వేగి గాలుల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది.

పటిష్టమైన రోగ నిరోధక శక్తి

వేసవిలో బలమైన రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేసుకోవాలి. తీసుకునే ఆహారంలో ఖనిజ లవణాలు అధికంగా ఉండేలా చూడాలి. పాలు, గుడ్లు, టమోటా, నారింజ, పసుపు రంగు కూరగాయలు, చిలకడదుంప, చేపలు, బ్లాక్ బెర్రి, బ్లూ బెర్రి తినడం మంచిది. ఆహారంలో సొరకాయ, బీరకాయ, దోసకాయ, పొట్లకాయ తదితర కూరగాయలు వినియోగించడం శ్రేయస్కరం.

ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి



ప్రతి ఒక్కరూ ఎండలో అవసరమైతే తప్ప బయటికి రాకుండా ఉండడం ఎంతో మంచిది. తలపై రక్షణకు గొడుగు లేదా టోపీ పెట్టుకోవాలి. చేనేత, కాటన్ దుస్తులు ధరించి మంచిది. ఎక్కువ నీరు తాగడంతోపాటు మనిషికి సరిపడేలా నిద్రపోవాలి. ప్రతిరోజు వ్యాయామం మరింత మంచిది. ఎండలు ఎక్కువగా ఉండడంతో కాఫీ, టీలు అలవాటున్న వారు వీలైనంత తగ్గించుకుంటే మంచిది.

– డాక్టర్ శ్రీనాథరెడ్డి, సూపరింటెండెంట్, వైఎస్సార్ ఏరియా ఆస్పత్రి, కడప

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : పట్టణంలోని త్యాగరాజకాలనీలో నూతనంగా నిర్మించిన అనంతరామస్వామి, త్యాగరాజస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు ఘనస్వాగతం పలికారు. పూజల అనంతరం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, బూత్ కన్వీనర్ల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యద్దారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పోలిరెడ్డి, పుత్తాశ్రీరాములు, అట్లూరు మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ వెంకటసుబ్బమ్మ, వార్డు ఇన్‌చార్జి రజనీకాంత్, నాయకులు మాడపూరు నడిపి వెంకటసుబ్బయ్య, వెంకటసుబ్బయ్య, మాడపూరు బ్రహ్మయ్య, రాజేష్, మౌలాలి, షఫి పాల్గొన్నారు.

నాటకాల విలువ పెంచిన కవి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రచయితలు

కడప కల్చరల్ : కడపకు చెందిన సుబ్బరాయకవి తెలుగు సాంఘిక, పౌరాణిక, చారిత్రక నాటకాలు రచించి వాటి విలువల పెంచారని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి కొనియాడారు. ఇటీవల కన్నుమూసిన సుబ్బరాయ కవి సంస్మరణ సమావేశం కడప సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ సుబ్బరాయకవి రాసిన నాటకాలలోని విశిష్టతను వివరించారు. ఆయన నటుడిగానూ రాష్ట్ర ప్రభుత్వ అవార్డులను పొందారన్నారు. బోగా రక్తదాన సేవా సమితి వ్యవస్థాపకుడు బోగా చిన్నయ్య, భూపతి రాయల్ ఆయన ఉద్యోగ జీవితాన్ని వివరించారు. రచయితల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ సుబ్బరాయ కవి హోమియో వైద్యుడిగా ఎందరికో సేవలు అందించారన్నారు. అనంతరం కేవీ రమణారెడ్డి, డాక్టర్ జీవీ సాయి ప్రసాద్ ఆయన సేవలనుకొనియాడారు. తొలుత అతిథులు సుబ్బరాయకవి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, గంగనపల్లి వెంకటరమణ ఆయనపై పద్యాల్ని ఆలపించి సుబ్బరాయకవితో తమ అనుబంధాన్ని తెలిపారు.

తొట్టిమెరవణి ఉత్సవం



స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని అనంతరాజపురం పంచాయితీ లక్ష్మీపాలెం గ్రామంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన స్వామి తొట్టిమెరవణి ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు ఆలయ ప్రాంగణానికి చేరుకుని తొట్టిమెరవణి కార్యక్రమానికి ఏర్పాట్లు సిద్ధం చేశారు. అనంతరం మధ్యాహ్నం నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి ప్రత్యేక వాహనంపైకి చేర్చి తొట్టిమెరవణి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. తొట్టిమెరవణి ముగిసిన అనంతరం భక్తుల దర్శనం కోసం స్వామివారిని వాహనంపై నుంచి కిందకు దించి గ్రామోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన చెక్కభజన, దేవతా మూర్తుల వేషధారణలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బద్వేలు అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ ఆధ్వర్యంలో ఎస్ఐ జె.రవికుమార్, పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తొలగని మురుగు.. తీరని వ్యథ



కడప నగరం ఓంశాంతి రోడ్ నెంబర్–17లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. కాలువ ఉన్నా మురుగుతో నిండి రోడ్డుపై ప్రవహిస్తోంది. స్థానికులు దుర్గంధం భరించలేక పోతున్నారు. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్నా.. గత కొన్ని రోజులుగా ఇక్కడ మురుగు నీరు ప్రవహిస్తున్నా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దోమలు పెరిగి జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి మురుగు తొలగించాలని వారు వాపోతున్నారు. – కడప కోటిరెడ్డి సర్కిల్

పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

కడప కల్చరల్: పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కడప నగరం కాగితాల పెంటలోని కింగ్ ప్యాలెస్‌లో పేదలకు ఆదివారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. స్థానిక లజనతుల్ ఉలమా వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ మౌల్వి ఖాజీ షేక్ మహమ్మద్ అలీ రషాది ఆధ్వర్యంలో 200 పేద కుటుంబాలకు సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా లజనతుల్ ఉలమా సొసైటీ వారు పవిత్రమైన రంజాన్ మాసంలో ఇలాంటి పుణ్య కార్యాలు నిర్వహించడం హర్షించదగిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మత గురువులు మౌల్వి అబ్దుల్ సలాం సాబ్, మౌల్వి అక్బర్ అలీ సాబ్, ఖాజీ సిరాజుద్దీన్ సాబ్, మౌల్వి కరీముల్లా సాబ్, ముస్లిం ప్రముఖులు నజీర్ అహ్మద్, డాక్టర్ షేక్ రబ్బానీ, షాహి ఆజం, మన్సూర్ అలీ ఖాన్, తాహిర్, అబ్దుల్ రెహమాన్, అక్రమ్, ఖాజా పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



రక్తదానం చేస్తున్న జుటూరు విజయ్ తదితరులు

కమలాపురం : రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ తేజస్వి తెలిపారు. ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బోగ పార్వతమ్మ బ్లడ్‌బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో రక్త నిల్వలు చాలా తక్కువగా ఉంటాయని, అలాంటి తరుణంలో ఇలాంటి రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. జిల్లా కేంద్రంలో రక్త నిల్వలు లేక చాలా మంది గర్భిణులు అత్యవసర శస్త్ర చికిత్స, ప్రమాద రోగులు, ముఖ్యంగా తలసేమీయా, సికిల్‌సెల్ అనీమియా రోగులకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. యువతీ యువకులు ధైర్యంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలన్నారు. ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సీహెచ్‌సీలో మహిళలు సైతం రక్తదానం చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. అనంతరం శిబిరంలో 15 మంది రక్తదానం చేశారు. వారిని నిర్వాహకులు పండ్ల రసాలు అందించారు. అలాగే వారికి ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో జుటూరు విజయ్‌కుమార్, బ్లడ్ బ్యాంక్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమా వాధితో అంధత్వ ముప్పు



అవగాహన కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్: కంటి వ్యాధి గ్లకోమా సోకితే అంధత్వం సంభవించే ప్రమాదముందని ఆప్తమాలజిస్ట్ డాక్టర్ శశిబిందు తిప్పన తెలిపారు. డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి ప్రాంగణంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం గ్లకోమా అవగాహన వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా శశిబిందు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా గ్లకోమా ఉన్నవారి సంఖ్య దాదాపు 80 మిలియన్లు ఉందన్నారు. 40 ఏళ్ల వయస్సు పైబడిన ప్రతి 200 మందిలో ఒకరికి, 80 ఏళ్లు పైబడిన ప్రతి ఎనిమిది మందిలో ఒకరికి గ్లకోమా ఉందన్నారు. క్రమబద్ధమైన పరీక్ష ఒక్కటే త్వరిత నిర్ధారణ చేయగలుగుతుందని, దృష్టి వైకల్యాన్ని నివారిస్తుందని తెలిపారు. అధిక మయోపియా(దూరం చూడటానికి మందంగా ఉన్న కళ్లద్దాలు), మధుమేహం, 4–6 వారాలకన్నా ఎక్కువ కాలం స్టెరాయిడ్లు ఉపయోగించిన వారికి గ్లకోమా వచ్చే ప్రమాదం ఉందన్నారు. మార్చి 8, 16వ తేదీలలో గ్లకోమా అవగాహన వారోత్సవాన్ని నేత్ర వైద్య సంస్థ నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీరం శ్రీధర్‌రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్స్ అధినేత శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



కమలాపురం బాయ్స్ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బల్లలు

కమలాపురం : పట్టణంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో 521 మంది విద్యార్థులు సోమవారం నుంచి పరీక్షలు రాసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. గురుకుల పాఠశాలలో 167 మంది, జడ్పీ గర్ల్స్ స్కూల్‌లో 75 మంది, జడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో 75 మంది, ప్రగతి–ఏ సెంటర్‌లో 104 మంది, ప్రగతి–బి సెంటర్‌లో 100 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు ఎంఈఓ బేబి తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 నిమిషాల వరకు పరీక్ష నిర్వహిస్తామని అయితే 9 గంటలకే ఓఎంఆర్ షీట్ ఇస్తామని, విద్యార్థులంతా 9 గంటల లోపే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఎంఈఓ తెలిపారు. విద్యార్థులందరికి బల్లలు ఏర్పాటు చేశామని, అలాగే నీరు, కరెంట్, ఫ్యాన్ తదితర సౌకర్యాలన్నీ పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసినట్లు ఆమె వివరించారు.

144 సెక్షన్ అమలు

పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రాలకు 500 మీటర్ల దూరం వరకు ఎవరూ ఉండవద్దని ఆయన తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సెంటర్ల వద్ద డ్రాప్ చేసి అక్కడ ఉండకుండా వెళ్లి పోవాలన్నారు. పరీక్షా సమయం ముగిసే వరకు పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలన్నారు.

నేటి నుంచి ప్రారంభం

ప్రొద్దుటూరు కల్చరల్ : పదో తరగతి పరీక్షలు నేటి నుంచి ప్రాంభం కానున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 8.30 గంటల సమయానికి పరీక్షా కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ప్రొద్దుటూరు డివిజన్‌లో 18 మండలాల్లోని ప్రభుత్వ, మున్సిపల్, ప్రైవేట్, కేజీబీవీ, ఏపీడబ్ల్యూఆర్ఎస్, ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన 12,678 మంది విద్యార్థులు 75 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష రాయనున్నారు. అలాగే ప్రొద్దుటూరు మండలంలో ఉన్న 81 ప్రభుత్వ, ప్రైవేటు, మున్సిపల్ ఉన్నత పాఠశాలలకు చెందిన 3,770 మంది విద్యార్థులు 23 కేంద్రాల్లో 10వ తరగతి పరీక్షలు రాయనున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో బెంచీల మీద హాల్ టికెట్ నంబర్లు వేయడంతో పాటు తాగునీటి, విద్యుత్ సౌకర్యం కల్పించారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయనున్నారు. కొందరు విద్యార్థులు ఆదివారమే తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు వెళ్లి గదులను తెలుసుకున్నారు.

ప్రశాంతగా పరీక్షలు రాయాలి

విద్యార్థులు ఉదయం 8.30 గంటలకు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రానికి చేరుకుని గదులను చెక్ చేసుకోవాలి. ప్రశాంతంగా పరీక్షలు రాసేదుకు ప్రయత్నించాలి. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాం.

– సావిత్రమ్మ, ఎంఈఓ, ప్రొద్దుటూరు

వైభవంగా కోట పోలేరమ్మ తిరునాల



వేడుకల్లో పాల్గొన్న నాయకులు

పోరుమామిళ్ల: పట్టణంలోని కోటపోలేరమ్మ తిరునాల ఆదివారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామునే అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. కుంకుమబండ్లు, కోలన్న బండ్లు పట్టణంలోని వీధుల నుంచి ఊరేగింపుగా వచ్చాయి. ఆదివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి, ఉపసర్పంచ్ రాళ్లపల్లె రవికుమార్, రఘు, నారాయణ, బాలగురివిరెడ్డి పోలేరమ్మను దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గుర్రప్ప, సిబ్బంది



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రత్యేక రాష్ట్ర సాధనకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన సేవలు మరువలేనివని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్, అసెంబ్లీ కో–ఆర్డినేటర్ బండి జకరయ్య పేర్కొన్నారు. నగరంలోని ఇందిరాభవన్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్ర సాధనకు ఆమరణ దీక్ష చేసి అశువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అన్నారు. కమాల్, కుల్లాయప్ప, జహార్, దినకర్‌రెడ్డి, సంధ్య పాల్గొన్నారు.

కడప అగ్రికల్చర్: ఆంధ్ర రాష్ట్ర స్థాపనలో అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని డీసీసీ బ్యాంకు స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్ గుర్రప్ప అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి స్థానిక డీసీసీ బ్యాంకులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి పొట్టి శ్రీరాముల చిత్రపటానికి రిజిస్ట్రార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం గుర్రప్ప మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర స్థాపనలో ఆయన ప్రధాన పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం ప్రతాప్‌రెడ్డి, ఏజీఎంలు నారాయణరాజు, వీరబ్రహ్మం, రాజేంద్రప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం భావితరాలకు ఆదర్శమని ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహనరావు కొనియాడారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక లైట్‌పాలెం సెంటర్‌లోని ఆయన విగ్రహానికి ఆర్యవైశ్యులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.